క్లుప్తంగా

వధూవరులను ఆశీర్వదించిన రాజన్నదొర



వధూవరులతో మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో మాజీ ఎంపీపీ బోయిన ఈశ్వరమ్మ కుమార్తె వివాహ విందులో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు సువ్వాడ భరత్ శ్రీనివాస్, దండి శ్రీను, పెద్దింటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

మీకై మేము సభ్యులకు అవార్డులు

సాలూరు: దాసరినారాయణరావు కల్చరల్ అకాడమీ 37వ వార్షికోత్సవం సందర్భంగా ఇవ్వనున్న అవార్డులకు సాలూరు పట్టణంలో గల మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీ గౌరమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఎంపికయ్యారు. ఈ అసోసియేషన్ చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఏపీజే అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డుకు మహేష్, నరేష్, శ్రీనివాసరావు, ఈశ్వరరావు, మనోజ్‌కుమార్, వసంత్‌కుమార్‌లు, నందమూరి తారకరామారావు జాతీయ రత్న అవార్డుకు భార్గవ్, మదర్ థెరిసా ఎక్సలెన్స్ అవార్డుకు కృష్ణవేణి, అనిల్‌కుమార్, డా.బీఆర్‌అంబేడ్కర్ ఎక్సలెన్స్ అవార్డుకు చంద్రశేఖర్‌రాజు ఎంపికయ్యారని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇప్పిలి దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అవార్డులకు ఎంపికైన వారిని అభినందించారు.


రాజ్యాంగాన్ని కాపాడుకుంటే లౌకిక విలువలు



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సాలూరు: రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ద్వారా లౌకిక విలువలు నిలబడతాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు తెలిపారు. ఈ మేరకు కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభను సాలూరులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సోషలిస్టు సమాజ సాధనకోసం అందరం కృషి చేయాలన్నారు.దేశంలో అన్ని రంగాల్లో ప్రపంచీకరణ ప్రమాదం పెరిగిందని, ప్రజలు వలసలు వెళ్లిపోవడం కనిపిస్తోందన్నారు. సీతారం ఏచూరి ఆశయాల సాధనకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు టి.వెంకటరావు, శంకర్, రవి, రాముడు తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం



నూకలవాడలో ఉపాధ్యాయురాలు ఉమాకాంతిని సన్మానించిన ఉపాధ్యాయులు

బలిజిపేట: ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న టీఆర్ ఉమాకాంతిని నూకలవాడ మోడల్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ఆమె ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన విషయం విదితమే. ఆమె ప్రస్తుతం నూకలవాడ మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. తోటి ఉపాధ్యాయురాలు అవార్డు తీసుకోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వరరావు, సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కళాఉత్సవ్‌లో మామిడిపల్లి విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు విజయనగరంలోని డైట్ కళాశాలలో జరిగిన కళాఉత్సవ్ 2025లో వివిధ పోటీలలో బహుమతులు గెలుచుకున్నట్లు పాఠశాల గైడ్ ఉపాధ్యాయిని జానకి తెలిపారు. ఓ సమాజామా నాటకం స్క్రిప్టుకు గాను ప్రథమ బహుమతిని చరిష్మా, ఉదయ శ్రీ, మైనిక, ఇందులు గెలుచుకున్నారు. అలాగే సంప్రదాయ కథాకథనం, బొమ్మల తయారీ పోటీలలో ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. ఈ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ తీగలు తాకేలా..!

పార్వతీపురం రూరల్: తీగజాతి మొక్కలు విద్యుత్ వైర్లను తాకేలా విద్యుత్ స్తంభాలను అల్లుకుపోతున్నాయి. పైదాకా వెళ్లి రెండువైపులా ఉన్న తీగలకు, ట్రాన్స్‌ఫార్మర్లకు ఎగబాకుతున్నాయి. వీధుల్లో ఉన్న విద్యుత్ స్తంభాలకు, అలాగే రహదారి పక్కన, వ్యవసాయ భూములకు అనుసరించి ఈ విధంగా ఉండడంతో ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా రైతులు, పశువులకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే సంబంధిత విద్యుత్ సిబ్బంది స్పందించి అల్లుకున్న తీగజాతి మొక్కలు లేకుండా చూడాలని కోరుతున్నారు. మండల పరిధిలోని వైకేఎం కాలనీ, వెంకంపేట, చిన బొండపల్లి, ఎమ్మార్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఇలా తీగలు అల్లుకుపోయిన స్తంభాలు సాక్షి కెమెరా కంటబడ్డాయి.



వైకేఎం కాలనీ ఆంజనేయస్వామి గుడి సమీపంలో



వెంకంపేట ఎస్సీ కాలనీ సమీపంలో



ఎమ్మార్‌నగర్ ప్రారంభంలో



చినబొండపల్లి మార్గమధ్యంలో విద్యుత్ తీగలను అల్లుకున్న మొక్కలు

ఎన్‌సీడీ 4.0సర్వేకు సిద్ధం కావాలి

- డాక్టర్ జగన్ మోహన్ మోహన్ రావు

పార్వతీపురంటౌన్: కేన్సర్ స్క్రీనింగ్ ప్రధాన లక్ష్యంగా నిర్వహించనున్న ఎన్‌సీడీ 4.0 సర్వేకు వైద్యసిబ్బంది సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలకు కేన్సర్ స్క్రీనింగ్‌పై ఎన్జీఓ హోంలో శుక్రవారం శిక్షణ నిర్వహించారు. గైనకాలజిస్ట్ డా. పూర్ణ చంద్రిక, డెంటల్ వైద్యులు డా.శ్యామల పవర్ ప్రెజెంటేషన్ ద్వారా కేన్సర్ లక్షణాలను గుర్తించే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ త్వరలో ప్రారంభం కానున్న ఎన్సీడీ4.0 సర్వేకు వైద్య సిబ్బంది పక్కా ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలని క్షేత్ర స్థాయిలో కేన్సర్ లక్షణాలను గుర్తించడం ప్రధాన లక్ష్యమని, ఇందుకు శిక్షణలో వివరించిన అంశాలను దష్టిలో ఉంచుకుని సరైన ఫలితాలు వచ్చేలా స్క్రీనింగ్ చేపట్టాలని ముఖ్యంగా నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్ లక్షణాలను గుర్తించాలని సూచించారు. వీటితో పాటు రక్తపోటు, మధుమేహం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి పర్యవేక్షణ చేయాలని చెప్పారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ భాస్కర రావు నేతత్వంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి గత నెలలో ప్రారంభమైన ఎన్సీడి4 కేన్సర్ స్క్రీనింగ్ శిక్షణ దశల వారీగా నిర్వహించి శుక్రవారం పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ పీఎల్. రఘుకుమార్, ఎపిడమాలజిస్ట్ డా సూర్యకౌశిక్, డీఐఓ తాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జగన్ మోహన్

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపాలి



మాట్లాడుతున్న ఆటోడ్రైవర్ల యూనియన్ ప్రతినిధులు గోపాల్, జగదీష్

సీతానగరం:

మహిళా టిక్కెట్లు లేక ఉపాధి కోల్పోయిన ఆటోడ్రైవర్లకు ఉపాధికల్పనకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలని మండలంలోని నాలుగు సెంటర్ల డ్రైవర్లు కోరుతున్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని జాతీయరహదారిపై హనుమాన్ జంక్షన్ వద్ద శుక్రవారం ఆటోడ్రైవర్ల యూనియన్ ప్రతినిధులు గోపాల్, జగదీష్, చిన్నారావు మాట్లాడుతూ తామంతా ఇంటర్, డిగ్రీలు చదువుని ఉద్యోగాల నిమిత్తం కాళ్లరిగేలా తిరిగినా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు దొరక్కపోవడంతో నిరుద్యోగులుగా కుటుంబాలకు బరువు కాకుండాఉండేందుకు డ్రైవింగ్ నేర్చుకుని రుణసదుపాయంతో ఆటోలు కొనుగోలుచేసుకుని రుణవాయిదాలు చెల్లిస్తూ మిగిలిన డబ్బులతో కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. చినభోగిలి ఆటోస్టాండ్, బొబ్బిలి స్టాండ్, సీతానగరం- అజ్జాడస్టాండ్, సీతానగరం- పార్వతీపురం, సీతానగరం- నిడగల్లు- మరిపివలస,-నిడగల్లు, చినబోగిలి-మక్కువ స్టాండ్‌లలో మండలంలోని సుమారు 400 మంది ఆటోలు నడుపుతూ జీవిస్తున్నామన్నారు. ఒక్కో ఆటో మూడు లేదా నాలుగుట్రిప్పులు నడిచేవన్నారు. మహిళలు,పురుషులు కలిసి (బస్సుల్లో ప్రయాణం చేయగా మిగిలిన వారు)ఆటోల్లో ప్రయాణం చేస్తున్నారని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు 'ఫ్రీ' బస్ సౌకర్యం కల్పించడం వల్ల ఆటోలకు రోజులో ఒక్కట్రిప్పుతిరగడానికే కష్టంగా ఉందని జీవనం గడవడం, పిల్లలను చదివించడం కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఆటోలకు ప్రయాణికులు లేకపోయినా కేసులు తప్పడం లేదని, స్పేర్ పార్టులధరలు విపరీతంగా పెరగడంతో అవస్థలు పడుతున్నామన్నారు. సంవత్సరానికి రూ.15 వేలు ప్రోత్సాహకం ఇస్తామనడం సబబు కాదని, ఉద్యోగాలు లేక, ఆటోలకు బేరాలులేక అవస్థలు పడుతున్న తమకు ప్రత్యామ్నాయంగా ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు.



చినభోగిలి-మక్కువ స్టాండ్‌లో ఖాళీగా ఉన్న ఆటోలు

క్వారీ తవ్వకాలు మాకొద్దు



హెచ్ కారాడవలసలో గ్రామస్తులతో మాట్లాడుతున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

పార్వతీపురం రూరల్: వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమంలో హెచ్ కారాడవలస గ్రామస్తులు తమ గ్రామ సమీపంలో ఉన్న ఎలుగుల మెట్ట వద్ద క్వారీ తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దంటూ అభిప్రాయం వ్యక్తం చేసినట్లు వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు గ్రామస్తులు తరపున పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు ఆర్‌వీఎస్ కుమార్, రైతు కూలీ సంఘం నాయకుడు ఈశ్వరరావు, గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు రంజిత్ కుమార్, సీపీఐ లిబరేషన్ పార్టీ నాయకులు పి. సంగం, జనసేన, ఇతర పార్టీ నాయకులు కొందరు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డి.పారినాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ఆశ్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల బయో రిసోర్స్ కేంద్రాల యజమానులతో నిర్వహించిన శిక్షణా సమావేశంలో ఆయన, స్టేట్ రిసోర్స్‌పర్సన్ పి.దేవుళ్లు పాల్గొని, మాట్లాడారు. ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా పంటలను సాగు చేయడం వల్ల నేలసారవంతంతో పాటు ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. ప్రకృతి సేద్యానికి అవసరమైన జీవామృతాలు, కషాయాలను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రీజనల్ థీమాటిక్ లీడ్ కె.ప్రకాష్, డీపీఎం ఎం.శ్రావణ్ కుమార్, ఎస్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం



సాలూరు: తహసీల్దార్ కార్యాలయం వద్ద అధికారికి మెమొరాండం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు

సాలూరు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి గౌరీశంకర్ అన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, ధనలక్ష్మిల ఆధ్వర్యంలో సాలూరు పట్టణ, మండల యూనియన్ సంయుక్తంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో నంబర్ 57ను తక్షణం అమలుచేయాలని, 12వ పీఆర్‌సీని నియమించి ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలను చెల్లించాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25లక్షలకు పెంచాలని కోరారు. అలాగే ,యాప్‌లు, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి తెలియచేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు మెమొరాండం అందజేశారు.

పార్వతీపురంలో..

పార్వతీపురం రూరల్: ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు చేపడుతున్న నిరసనలో భాగంగా పార్వతీపురం మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల బాలకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు 12వ పీఆర్‌సీని, ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల కరువు భత్యాన్ని చెల్లించాలని, అలాగే ప్రధానంగా బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన మెమొరాండాన్ని తహసీల్దార్ కార్యాలయం ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించేందుకు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, తిరుమల రావు, బీవీఆర్ కె.నాయుడు, గొట్టాపు మురళి, అప్పలనాయుడు, గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో ఏఓకు మెమొరాండం అందజేస్తున్న ఉపాధ్యాయులు

హిందీ వ్యాసరచన పోటీలు

బలిజిపేట: మండలంలోని వంతరాం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చిన్ని వెంకటరమణ ఆధ్వర్యంలో హిందీ వ్యాసరచన పోటీలను శుక్రవారం నిర్వహించారు. సోమవారం నిర్వహించనున్న హిందీ దివస్ కార్యక్రమంలో భాగంగా 8,9,10తరగతుల విద్యార్థులకు హిందీ వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. హిందీ భాష ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు, భాషపై పట్టు సాధించేందుకు వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి సోమవారం నాటి హిందీ దివస్ కార్యక్రమంలో బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు బి.అప్పలస్వామినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



వంతరాం ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

బీజేపీ తీరుతో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

పార్వతీపురం టౌన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో విదేశాంగ విధానం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం ఫెడరలిజం ప్రమాదంలో పడ్డాయని ఆర్థిక వ్యవస్థ సైతం కుంటుపడుతోందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. కమ్యూనిస్టు నాయకుడు దివంగత ఏచూరి సీతారాం ప్రథమ వర్ధంతి సభలో పాల్గొన్న ఆయన శుక్రవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో జరిగిన సభలో మాట్లాడుతూ ప్రస్తుతం బీజేపీ మతోన్మాద ధోరణి నుంచి ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సి ఉందని, ఈ విషయంలో తెలుగు రాష్ట్రాల వామపక్ష ఉద్యమానికి గురుతర బాధ్యత ఉందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఉన్న పార్టీలు బీజేపీకి సాగిల పడుతున్నాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కె.మురళి, పక్కి రవీంద్ర, నీరస శ్రీనివాసరావు, లక్ష్మణ నాయుడు, సీఐటీయూ నాయకులు జి.వెంకటరమణ, బీవీఆర్, ఇందిర, ఉమామహేశ్వరి, సూరిబాబు, రెడ్డి శ్రీదేవి, గిరిజన సంఘం నాయకులు రామస్వామి, రాము, ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిల్, సురేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.



ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జంఝావతి ప్రాజెక్ట్ పూర్తి చేసేదెప్పుడు?



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోట జీవన్న

- సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోట జీవన్న

పార్వతీపురం టౌన్:

ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం, ఆంధ్రాలో బీజేపీ అనుబంధ ప్రభుత్వం ఎప్పుడు జంఝావతి ప్రాజెక్టును పూర్తి చేస్తాయో ప్రజలకు తెలియజేయాలనీ సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు.

జంఝావతిపై ప్రకటనలు కాదు ముందు పనులు జరగాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పడి ఏడాదిన్నర అవుతోందని, తర్వాత స్థానిక సంస్థలకు ఎన్నికలు వచ్చేస్తాయన్నారు. జంఝావతి ప్రాజెక్టును ఎప్పుడు పూర్తి చేస్తారో ప్రజలకు చెప్పవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందన్నారు. జంఝావతి ప్రాజెక్టు పూర్తి కాక, వర్షాలు సకాలంలో కురవక, వ్యవసాయం లాభాదాయకంగా లేకపోవడంతో జంఝావతి ఆయకట్టు ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు పెద్దపెద్ద పట్టణాలు హైదరాబాద్, చెన్నై విజయవాడ, విశాఖ తదితర ప్రాంతాలకు వలసపోయి కూలీలుగా, వాచ్‌మెన్‌లుగా మారారన్నారు. ఒడిశా సమస్య సాకుతో అర్ధశతాబ్ద కాలంగా ఇక్కడి రైతులను మోసం చేస్తూ కాలం గడిపేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, బొత్స మోహన్ రావు, జి.జనార్దన్, ఎ.సీతమ్మ, జిల్లా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమస్యల పరిష్కారం ఎప్పుడు?

- మండల సమావేశంలో సభ్యుల ప్రశ్నలు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో విద్యార్థులు, ప్రజలు ఏడాదిగా వివిధ శాఖల ద్వారా ఎదుర్కొంటున్న సామాజిక పరమైన సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారని మండల సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బలగ రమణమ్మ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్యసమావేశం జరిగింది. అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు మార్గదర్శకాలు ప్రభుత్వం విడుదల చేసిందని నిధులు విడుదల చేయకపోవడం వల్ల చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారని పాపమ్మవలస సర్పంచ్ ఎం.గౌరునాయుడు ప్రశ్నించారు. దీనికి ఐసీడీఎస్ పీఓ మాట్లాడుతూ ఇప్పలవలస, పాపమ్మవలస, పెదభోగిలి పంచాయతీలోని రెండు అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉందని సమాధానం ఇచ్చారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతున్నా వారందరికీ తల్లికివందనం పథకం ద్వారా రూ.15 వేలు బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ చాలా మందికి తల్లికి వందనం పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించ లేదని సభ్యులు ఎస్.గౌరి, పార్వతిలు ఆరోపించారు. అలాగే కొంత మందికి రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకూ తల్లుల ఖాతాల్లో తల్లికివందనం నిధులు జమ అయ్యాయన్నారు.

సోలార్ రాయితీలు వినియోగించుకోవాలి

ఏపీఈపీడీసీఎల్ ఏఈ శశిభూషణరావు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు సోలార్ పవర్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు వినియోగించుకోవాలని కోరారు. పీహెచ్‌సీల్లో సమస్త వ్యాధుల నివారణకు అవసరమైన మందులు ఉన్నాయని పీహెచ్‌సీ డాక్టర్లు రమ్యసాయి, ఉషారాణి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.కుమారవర్మ, తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ ఏఓ వెంకటరమణ, మండల ఏఓ ఎస్.అవినాష్, ఇంజినీరింగ్ అధికారులు పవన్‌కుమార్, జానకీరాం, ఉపాధిహామీ ఏపీఓ బాలకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బలగ రమణమ్మ



అంగన్వాడీ సెంటర్‌లో సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న పాపమ్మవలస సర్పంచ్ ఎం.గౌరునాయుడు

ఎలుగుల మెట్టపై గ్రానైట్ తవ్వకాలు వద్దు

- మెట్టను పరిశీలించిన రైతు సంఘం నాయకులు

పార్వతీపురం రూరల్: మండలంలోని హెచ్ కారాడవలస సమీపంలో రెండు గ్రామాల రెవెన్యూ పరిధిలో ఉన్న ఎలుగుల మెట్టపై గ్రానైట్ తవ్వకాలు చేపట్టవద్దని ఏపీ రైతుసంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం నాయకులు స్థానికులతో కలిసి మెట్టను పరిశీలించారు. ఈ క్రమంలో స్థానికులతో కలిసి కొండతవ్వకాలను ఖండిస్తూ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రానైట్ తవ్వకాలు వద్దంటూ వ్యతిరేకించిన హెచ్‌కారాడవలస, పెదబొండపల్లి గ్రామాల ప్రజల అభిప్రాయాన్ని ఏపీ రైతు సంఘం బలపరుస్తుందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలనే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, స్థానిక రైతులు, కొందరు యువకులు పాల్గొన్నారు.



ఎలుగుల మెట్టపై స్థానికులతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు